# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 08-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మహిళలకు సరైన అవకాశాలు, మద్దతు లభిస్తే ప్రతి రంగంలోనూ అద్భుతమైన విజయాలు సాధించగలరని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశ్వాసం వ్యక్తం చేశారు.

- ❖ విశ్వవిద్యాలయాలు జరిపే పరిశోధనలను దేశాభివృద్ధికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మార్చాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు.

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో సుమారు 33 వేల 500 కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు ఈరోజు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

- ❖ ఐసిసి పురుషుల క్రికెట్ టీ-20 ప్రపంచ కప్ ఫైనల్ లో న్యూజిలాండ్ తో జరుగుతున్న మ్యాచ్‌లో భారత్ భారీ స్కోర్ దిశగా సాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళలకు సరైన అవకాశాలు, మద్దతు లభిస్తే ప్రతి రంగంలోనూ అద్భుతమైన విజయాలు సాధించగలరని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశ్వాసం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన వేడుకల్లో రాష్ట్రపతి ప్రసంగించారు. భారతదేశం మహిళా నేతృత్వంలోని అభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తోందని, అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని ఆమె పేర్కొన్నారు. మహిళా సాధికారతకు బేటీ బచావో - బేటీ పఢావో, పీఎం ముద్రా యోజన, మిషన్ శక్తి వంటి పథకాలు ఎంతో దోహదపడ్డాయని రాష్ట్రపతి వివరిస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ రోజు సామాజిక

మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యావంతులైన, సాధికారత పొందిన మహిళలే ప్రగతిశీల దేశానికి బలమైన పునాదులని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. మహిళల శక్తి, వారు సాధించిన విజయాలు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమం నుండి ఆధునిక భారతదేశ పునర్నిర్మాణం వరకు, మహిళలు ప్రతి రంగంలోనూ పటిష్టమైన నాయకత్వాన్ని అందించారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. భారతదేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న తరుణంలో… మహిళల ఆకాంక్షలు , సహకారం `వికసిత్ భారత్` లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తరాలను తీర్చిదిద్దడంతో పాటు, శాస్త్రీయ, ఆర్థిక పురోగతిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

విశ్వవిద్యాలయాలు జరిపే పరిశోధనలను దేశాభివృద్ధికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మార్చాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. త్రిపురలోని మహారాజా బీర్ బిక్రమ్ శతబర్షికి భవన్‌లో ఈరోజు జరిగిన త్రిపుర విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా  ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ…. విద్యార్థులు తమ జీవితంలో విజయం సాధించడానికి కృషి, క్రమశిక్షణ,  అంకితభావం అనే మూడు సూత్రాలను పాటించాలని పిలుపునిచ్చారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాధాకృష్ణన్ విజ్ఞప్తి చేస్తూ…

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో సుమారు 33 వేల 500 కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు ఈరోజు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఇందులో 18 వేల 300 కోట్ల రూపాయల విలువైన మెట్రో ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ… యమునా నదిని శుద్ధి చేసేందుకు కోట్లాది రూపాయల ప్రాజెక్టులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఢిల్లీ సవాళ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం అత్యంత వేగంగా పని చేస్తోందని తెలిపారు. దేశ నిర్మాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. భారతదేశం మహిళా సాధికారతలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందని ప్రధానమంత్రి తెలియజేస్తూ…

(వాయిస్ 32 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ రోజు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీలో “శక్తి వాక్” (Shakti Walk) నిర్వహించింది. ఢిల్లీలోని ఇండియా గేట్ నుండి కర్తవ్య పథ్ మీదుగా విజయ్ చౌక్ వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర ఈ నడక సాగింది. `షీ లీడ్స్ భారత్` అనే ఇతివృత్తంతో (Theme) జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి, సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాతో పాటు వివిధ మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి అన్నపూర్ణా దేవి మాట్లాడుతూ… వివిధ రంగాలకు చెందిన మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం.. అభివృద్ధి పట్ల వారి నిబద్ధతను తెలియజేస్తుందని అన్నారు. “వికసిత్ భారత్” నిర్మాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారని కేంద్రమంత్రి స్పష్టం చేస్తూ…

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ రోజు చండీగఢ్‌లో నిర్వహించిన వాక్‌థాన్‌ను  భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) జస్టిస్ సూర్య కాంత్ ప్రారంభించారు. ఈ  సందర్భంగా ఆయన పాత్రికేయులతో  మాట్లాడుతూ... మహిళా హక్కులపై సమాజంలో అవగాహన కల్పించడమే ఈ వాక్‌థాన్ ప్రధాన ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, యువ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్త అథ్లెటిక్స్ లీగ్ `అస్మిత`(ASMITA)ను ఈరోజు ప్రారంభించింది. ఖేలో ఇండియా మిషన్‌లో భాగంగా క్రీడలలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి చేపట్టిన ఒక విశిష్ట కార్యక్రమమే అస్మిత. ఈ లీగ్‌లో ప్రధానంగా 100, 200, 400 మీటర్ల పరుగు పందెంలు ఉంటాయి. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే ఈ క్రీడా లీగ్‌ను ప్రారంభించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పెద్ద సంఖ్యలో క్రీడల్లో పాల్గొనాలని కేంద్ర సహాయ మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐసిసి పురుషుల క్రికెట్ టీ-20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన భారత ఓపెన్లు అభిషేక్ శర్మ 52, సంజు శాంసన్‌లు 89 పరుగులతో రాణించి అద్భుత ఆరంభాన్ని అందించారు. దీంతో  భారత్ 18 ఓవర్లు పూర్తయే సరికి 4 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రేపటి నుండి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగుతాయి. మొదటి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై... ఫిబ్రవరి 13 వరకు జరిగాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు “సబ్ కా సాత్ సబ్ కా వికాస్ - ప్రజల ఆకాంక్షల నెరవేర్పు” అనే ఇతివృత్తంతో నిర్వహించనున్న బడ్జెట్ అనంతర వెబినార్‌ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. దృశ్య మాధ్యమ విధానంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ వెబినార్‌లో విద్య, నైపుణ్యం, ఆరోగ్యం, ఆయుష్, పర్యాటకం, ఆతిథ్యం వంటి కీలక రంగాలపై ప్రత్యేక చర్చా సమావేశాలు జరుగుతాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =